జ్వాల

# దశ

నిజం.. నిర్భయంగా..

WWW.DASHANEWS.COM

సోమవారం 23 02 2026

సంపుటి 1 సంచిక 93

పేజీలు : 04

PRGI No : TGTEL/25/A4195







# నీటి వాటాలపై రాజీ పడబోం..

## గోదావరి, కృష్ణా జలాల్లో తెలంగాణ హక్కులను కాపాడుతాం

## హక్కుల విషయంలో ఎలాంటి సందేహాలు అక్కరలేదు

## 'బడ్జెట్' తర్వాత మరోసారి మేడారం సందర్శించి సమీక్షిస్తా: సీఎం రేవంత్ రెడ్డి

**దశ, హైద్రాబాద్ :** గోదావరి నదీ జలాల వినియోగం, దానిపై తలెత్తిన వివాదాలు, ప్రాజెక్టుల నిర్మాణం వంటి అన్ని అంశాలపై శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో సమగ్రంగా ఒకరోజు చర్చిస్తామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి చెప్పారు. గోదావరి, కృష్ణా జలాల్లో తెలంగాణ హక్కులను కాపాడుతామని, ఆ విషయంలో ఎవరికీ ఎలాంటి సందేహాలు అక్కరలేదని పునరుద్ఘాటించారు. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం జె. చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకం పంప్ హౌస్‌ను ముఖ్యమంత్రి పరిశీలించారు. ఇంజనీర్లను అడిగి వివరాలు తెలుసుకున్నారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి , ధనసరి అనసూయ సీతక్క , పొంగులేటి శ్రీనివాస రెడ్డి , సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి తో పాటు ఎంపీ, ఎమ్మెల్యేలు, అధికారులతో కలిసి



దేవాదుల ఇంటేక్ పాయింట్ వద్ద మోటార్లను పరిశీలించిన అనంతరం ప్రాజెక్టు స్థితిగతులపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "తెలంగాణ నీటి హక్కుల విషయంలో శాశ్వత పరిష్కారం కోరుకుంటున్నాం. ఒక ప్రణాళికాబద్ధంగా ప్రాజెక్టులను పూర్తి చేయాలని ముందుకు వెళుతున్నాం. అవసరమైన నిధులను సమీకరిస్తున్నాం. ఎంతటి జటిలమైన సమస్య అయినా చర్చల ద్వారా పరిష్కారమవుతుందని

..మిగతా 2వ పేజీలో →

# తెలంగాణలో ఎంపీటీసీ, జడ్పీటీసీ వ్యవస్థల రద్దు.. అసాధ్యమే..!!

పరిషత్‌లకు చాలా స్వల్పంగానే నిధులు.

ప్రాక్టికల్‌గా ఆలోచిస్తే సాధ్యం కాదు

**దశ, రంగారెడ్డి :** తెలంగాణలో స్థానిక సంస్థల పునర్వ్యవస్థీకరణపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాలు చర్చనీయాంశంగా మారుతున్నాయి. దశాబ్దాలుగా కొనసాగుతున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ వ్యవస్థలను రద్దు చేయాలనే ప్రాథమిక నిర్ణయానికి వచ్చినట్లుగా తెలంగాణ ప్రభుత్వ వర్గాలు లీకులు ఇస్తున్నాయి. ప్రస్తుతమున్న ఎంపీటీసీ , జడ్పీటీసీ వ్యవస్థల వల్ల అధికార యంత్రాంగం క్లిష్టంగా మారుతోందని, నిధుల వినియోగంలో జాప్యం జరుగుతోందని రేవంత్ రెడ్డి ప్రభుత్వం భావిస్తోంది. ఈ మధ్యంతర వ్యవస్థలను తొలగించి, గ్రామ పంచాయతీ సర్పంచులకు , జిల్లా స్థాయి యంత్రాంగానికి మధ్య ప్రత్యక్ష సంబంధాన్ని నెలకొల్పాలని ముఖ్యమంత్రి అనుకుంటున్నారు. ప్రస్తుతం మండల పరిషత్ , జిల్లా పరిషత్ సభ్యులకు కేటాయించే నిధులు చాలా పరిమితంగా ఉంటున్నాయి. అనేక సందర్భాల్లో ఎంపీటీసీలకు కనీస అధికారాలు కూడా ఉండటం లేదనే అసంతృప్తి వారిలో ఉంది. ఈ వ్యవస్థను రద్దు చేయడం ద్వారా పాలనాపరమైన ఖర్చులను తగ్గించడమే కాకుండా, నిర్ణయాలు తీసుకునే ప్రక్రియను వేగవంతం చేయవచ్చని రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. మండల వ్యవస్థను కేవలం పరిపాలనా విభాగంగానే ఉంచి, రాజకీయ ప్రాతినిధ్యాన్ని గ్రామ, జిల్లా స్థాయిలకే పరిమితం చేయడం ద్వారా ద్వంద్వ పాలన కు స్వస్తి పలకాలని ప్రభుత్వం భావిస్తోంది. ఎంపీటీసీ, జడ్పీటీసీ వ్యవస్థలను రద్దు చేయడం అంత సులభమైన విషయం కాదు. భారత రాజ్యాంగంలోని 73వ సవరణ



ప్రకారం దేశంలో మూడంచెల పంచాయతీ రాజ్ వ్యవస్థ గ్రామ, మండల, జిల్లా స్థాయిలు అమలులో ఉండాలి. దీనిని మార్చాలంటే రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో తీర్మానం చేయడంతో పాటు, కేంద్ర ప్రభుత్వం , పార్లమెంటు ఆమోదం కూడా అవసరమవుతుంది. కేవలం రాష్ట్ర స్థాయి నిర్ణయంతో రాజ్యాంగబద్ధమైన ఈ వ్యవస్థలను రద్దు చేయడం సాధ్యం కాదని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఒకవేళ ప్రభుత్వం మొగ్గు చూపితే, దీనిపై సుదీర్ఘమైన న్యాయ పోరాటం జరిగే అవకాశం ఉంది. పరిషత్‌ల రద్దు ప్రతిపాదనపై రాజకీయంగా తీవ్ర వ్యతిరేకత వచ్చే అవకాశం కనిపిస్తోంది. స్థానిక సంస్థల్లో పట్టు సాధించాలనుకునే నాయకులు ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించే అవకాశం ఉంది. ముఖ్యంగా విపక్షాలు దీనిని ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యగా అభివర్ణించే ప్రమాదం ఉంది. అందుకే రేవంత్ ఆలోచన చర్చకు కారణం అవుతుంది కానీ అమల్లోకి రాకపోవచ్చు..!!

# మూసీ ప్రాజెక్ట్ పేరుతో రియల్ ఎస్టేట్ రాజకీయాలు చేస్తున్నారు: హరీశ్ రావు



**దశ, హైదరాబాద్:** సీఎం రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలను కాంగ్రెస్ సర్కార్ ఇబ్బందులకు గురిచేస్తోందని ధ్వజమెత్తారు. ఆదివారం హైదర్‌షా కోట టిప్పుఖాన్ బ్రిడ్జి సమీపంలో మధుపార్క్ అపార్ట్‌మెంట్ వాసులతో హరీశ్ రావు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదర్‌షా కోటలో మూసీ బాధిత కుటుంబాలకు భరోసాగా ఉంటామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం మూసీ సుందరీకరణ పనులు చేపడుతోందని.. అవసరమైతే కేసీఆర్ ఈ అపార్ట్‌మెంట్‌కు వస్తారని తెలిపారు. ఈ అపార్ట్‌మెంట్‌కు గతంలో కేసీఆర్ మూడుసార్లు వచ్చారని ప్రస్తావించారు. ఆ నివాస భవనం వారికిచ్చిన నోటీసులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ పేదల బతుకులను కూల్చవద్దని ఆయన హితవు పలికారు.

ఈ అపార్ట్‌మెంట్ వారిని కాంగ్రెస్ సర్కార్ ఇబ్బంది పెట్టొద్దని ఈ సందర్భంగా హరీశ్ రావు కోరారు. పేదలకు అండగా ఉండాలని కేసీఆర్ తమను ఇక్కడకు

..మిగతా 2వ పేజీలో →

# దేశంలో 32 ఫేక్ వర్సిటీలు

## గుర్తించిన యూజీసీ... ఫేక్ యూనివర్సిటీల జాబితా విడుదల




**దశ, హైదరాబాద్ :** దేశంలో అర్హత లేని ఫేక్ యూనివర్సిటీలు 32 ఉన్నట్లు యూజీసీ (యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్) గుర్తించింది. ఫేక్ యూనివర్సిటీల జాబితాను తాజాగా విడుదల చేసింది. వీటిలో చదివే, చదవాలనుకునే విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని యూజీసీ హెచ్చరించింది. కేంద్ర విద్యాశాఖ ఆధ్వర్యంలోని, ఉన్నత విద్యా విభాగం ఆధ్వర్యంలో పని చేసే యూజీసీ.. దేశంలో కొనసాగుతున్న యూనివర్సిటీల అర్హతలపై సమీక్ష చేస్తుంది.తనిఖీలు నిర్వహించి.. తగిన అర్హతలుంటే అనుమతులివ్వడం లేదంటే నిరాకరించడం, బ్లాక్ లిస్టులో పెట్టడం వంటివి చేస్తుంది. ప్రతి ఏటా అలా అర్హత లేని యూనివర్సిటీలను గుర్తించి, నోటీసులు జారీ చేస్తుంటుంది. విద్యార్థులకు అవగాహన కల్పిస్తుంది. దీనిలో భాగంగా తాజాగా దేశంలో 32 యూనివర్సిటీలు ఫేక్ అని వెల్లడించింది. యూజీసీ యాక్ట్ ప్రకారం ఈ యూనివర్సిటీలు ఇచ్చే డిగ్రీలు, పీజీలు వంటివి చెల్లవు. వాటికి చట్టబద్ధత లేదు. అంటే ఆ యూనివర్సిటీలు జారీ చేసే సర్టిఫికెట్లు ఎందుకూ పనికిరావు. ఇలాంటి యూనివర్సిటీల్లో ఢిల్లీ టాప్‌లో ఉంది. ఇక్కడ 12 యూనివర్సిటీలు ఫేక్ అని తేలింది. ఏపీలో గుంటూరులోని క్రిస్ట్ న్యూ టెస్టమెంట్ డీమ్డ్ యూనివర్సిటీ, విశాఖపట్నంలోని బైబిల్ ఓపెన్ యూనివర్సిటీ ఆఫ్ ఇండియా అనే యూనివర్సిటీలు ఫేక్ అని వెల్లడించింది. తాజా జాబితాకు సంబంధించి రాష్ట్రాల వారిగా ఫేక్ యూనివర్సిటీలు ఇలా ఉన్నాయి. ఢిల్లీలో 12, యూపీలో 4, ఏపీలో 2, కర్ణాటకలో 2, కేరళలో 2, మహారాష్ట్రలో 2, పుదుచ్చేరిలో 2, పశ్చిమ బెంగాల్‌లో 2, అరుణాచల్ ప్రదేశ్‌లో 1, హరియాణాలో 1, ఝార్ఖండ్‌లో 1, రాజస్థాన్‌లో 1 చొప్పున యూనివర్సిటీలు ఫేక్ అని తేలింది.

# అబ్దుల్లాపూర్ మెట్లో వ్యక్తి అదృశ్యం

**దశ, అబ్దుల్లాపూర్ మెట్:** వ్యక్తి అదృశ్యమైన సంఘటన అబ్దుల్లాపూర్ మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు వివరాల ప్రకారం... హైదరాబాద్ రామంతపూర్ కు చెందిన అనుగుల జయప్రకాశ్ రెడ్డి (70) కుటుంబ సభ్యులతో కలిసి అబ్దుల్లాపూర్ మెట్ మండలం జే ఎన్ ఎన్ యూ ఆర్ ఎం కాలనీలో నివాసముంటున్నాడు. ఇంట్ల పని విషయంలో శనివారం భార్యాభర్తల మధ్య గొడవలు చోటు చేసుకున్నాయి. దీంతో జయప్రకాశ్ రెడ్డి శనివారం ఉదయం 8:30 ఇంట్లో నుంచి బయటికి వెళ్లిపోయాడు. సాయంత్రమైనా తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అబ్దుల్లాపూర్ మెట్ పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశారు.




# రాష్ట్ర ఎన్నికల కమిషనర్లతో ఈసీఐ సమావేశం..




**దశ, న్యూఢిల్లీ:** భారత ఎన్నికల సంఘం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ల తో మంగళవారం న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జాతీయ స్థాయి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనుంది. ఈ సమావేశం 27 సంవత్సరాల తర్వాత నిర్వహించబడుతోంది. గత సమావేశం 1999 సంవత్సరంలో జరిగింది. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఈ సమావేశానికి అధ్యక్షత వహిస్తారు. ఎన్నికల కమిషనర్లు డా. సుఖ్బీర్ సింగ్ సాంధు, డా. వివేక్ జోషి సమక్షంలో సమావేశం జరుగనుంది. అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల రాష్ట్ర ఎన్నికల కమిషనర్లు తమ న్యాయ, సాంకేతిక నిపుణులతో కలిసి పాల్గొంటారు. అలాగే 36 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రధాన ఎన్నికల అధికారులు కూడా ఈ సమావేశంలో పాల్గొంటారు. ఎన్నికల ప్రక్రియలు, లాజిస్టిక్స్ విషయాల్లో ఈసీఐ, రాష్ట్ర ఎన్నికల కమిషన్ల మధ్య సమన్వయాన్ని పెంపొందించడం ఈ రౌండ్ టేబుల్ సమావేశం ప్రధాన లక్ష్యం. ఈ చర్చలు ఆలోచనల మార్పిడికి వేదికగా నిలిచి, ఎన్నికల నిర్వహణలో సహకార సమాఖ్య భావనను బలోపేతం చేయనున్నాయి. ఒక రోజు పాటు జరిగే ఈ సమావేశంలో సాంకేతికత వినియోగం, ఈవీఎంలు ఓటరు జాబితాలు, ఎన్నికల ప్రక్రియలను బలోపేతం చేయడం వంటి అంశాలపై చర్చలు జరుగుతాయి. కమిషన్ సీనియర్ అధికారులు ఇటీవల ప్రారంభించిన ECINET డిజిటల్ ప్లాట్‌ఫారమ్, ఎన్నికల సేవలను సులభతరం చేసే దాని సామర్థ్యంపై ప్రదర్శనలు ఇస్తారు. ఈవీఎంల బలమైన నిర్మాణం, పారదర్శకత, భద్రతా చర్యలపై కూడా ప్రత్యేకంగా వివరణలు ఇవ్వబడతాయి.

# గజిబిజి నిర్మాణాలకు చెక్.. ఫాంహౌస్ పాలసీకి కసరత్తు



**దశ, రంగారెడ్డి :** ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్, జనాల రద్దీ, పొల్యూషన్ తట్టుకోలేక.. వీకెండ్, సెలవులు వచ్చాయంటే చాలు.. నగరవాసులు నగరం బయటికి వెళ్లి ఫాంహౌస్‌లలో సేద తీరుతున్నారు. ఈ క్రమంలోనే హైదరాబాద్ నగరం చుట్టుపక్కల వేల సంఖ్యలో ఫాంహౌస్‌లు ఉన్నాయి. కొన్ని చాలా ఏళ్ల క్రితమే నిర్మితం కాగా.. మరికొన్ని ఇటీవలి కాలంలో పుట్టుకొచ్చాయి. అయితే మన రాష్ట్రంలో ఫాంహౌస్‌ల నిర్మాణానికి పర్మిషన్లు, విధి విధానాలు అంటూ ప్రత్యేకంగా ఏమీ లేవు. ఈ నేపథ్యంలోనే దీనిపై రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. ఈ క్రమంలోనే ఫాంహౌస్ నిర్మాణాలకు ప్రత్యేక విధానాన్ని తీసుకువచ్చేందుకు సిద్ధమైంది. ఇప్పటివరకు ఫాంహౌస్‌లను నిర్మించుకునేందుకు ఎలాంటి నిబంధనలు లేకపోవడంతో అడ్డగోలుగా నిర్మాణాలు పెరిగిపోతున్నాయి. ఈ నేపథ్యంలోనే సమగ్ర ఫాంహౌస్ పాలసీని తీసుకువచ్చి.. వాటిపై నియంత్రణ తీసుకురావడంతో పాటు ప్రణాళికాబద్ధంగా అభివృద్ధిని సాధించాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. దీనికి సంబంధించి విధివిధానాలు, ఫీజులు, అభివృద్ధి ఛార్జీలపై సంబంధిత అధికారులు కసరత్తులు ప్రారంభించారు. జోన్ పరిమితులు లేకుండా.. కన్వర్షన్, బయో కన్వర్షన్, కమర్షియల్, ఇండస్ట్రియల్ జోన్లలో కూడా ఫాంహౌస్‌లకు అనుమతులు ఇవ్వాలని రేవంత్ సర్కార్ ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. పంజాబ్, హర్యానా, మహారాష్ట్ర రాష్ట్రాల్లో ఉన్న విధానాలను అధ్యయనం చేసి.. ఆ తర్వాత వీటికి సంబంధించి విధివిధానాలను ఫైనల్ చేయనున్నారు. ఈ ఫాంహౌస్ పాలసీ అమలుతో రాష్ట్ర ప్రభుత్వానికి నిర్మాణం, అభివృద్ధి ఫీజుల రూపంలో ఆదాయం పెరగనుందని సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది. కరోనా మహమ్మారి తర్వాత ఫాంహౌస్‌లకు వెళ్లడంపై మధ్య తరగతి, ఎగువ మధ్య తరగతి కుటుంబాలు బాగా ఆసక్తి చూపిస్తున్నాయి. వీకెండ్ సేద తీరేందుకు ఫాంహౌస్‌లను వెళ్లే వారి సంఖ్య భారీగా పెరిగింది. అయితే ప్రస్తుతం

..మిగతా 2వ పేజీలో →

## గజిబిజి నిర్మాణాలకు చెక్..

**మొదటి పేజీ తరువాయి**

100, 200 గజాల్లో కూడా ఫాంహౌస్‌లు నిర్మిస్తున్నారు. ఇలా చిన్న చిన్న స్థలాల్లో ఫాంహౌస్ నిర్మించి.. ఆ భూములను గుంటల లెక్కన రిజిస్ట్రేషన్లు చేస్తూ అక్రమాలకు తెరతీస్తున్నారు. ప్రభుత్వం నుంచి అధికారికంగా అనుమతుల వ్యవస్థ స్పష్టంగా లేకపోవడంతో బిల్డర్లు ఇష్టం వచ్చినట్లు నిర్మాణాలు చేపడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. హైదరాబాద్ నగరం బయట పెద్ద అంబర్ పేట , మొయినాబాద్, చేవెళ్ల, శంషాబాద్, శంకర్‌పల్లి, కందుకూరు, ఘట్‌కేసర్, మేడ్చల్ ప్రాంతాల్లో భారీగా ఫాంహౌస్ లేఅవుట్లు పుట్టుకొస్తున్నాయి. చట్టపరంగా మాత్రం ఆ భూములు ఇప్పటికీ వ్యవసాయ భూములుగానే పరిగణించడం గమనార్హం. కొత్తగా తీసుకొచ్చే పాలసీ ప్రకారం తక్కువలో తక్కువగా ఫాంహౌస్ నిర్మించాలంటే 1,200 చదరపు గజాల స్థలం ఉండాలి. ఆ ఫాంహౌస్‌కు కనీసం 30 అడుగుల వెడల్పైన రోడ్డు తప్పనిసరిగా ఉండాలి. మొత్తం స్థలంలో కేవలం 20 శాతం మాత్రమే కాంక్రీట్ నిర్మాణానికి అనుమతి ఉంటుంది. 1,200 చదరపు గజాల స్థలంలో 240 గజాల విస్తీర్ణంలో జీ ప్లస్ వన్ బిల్డింగ్ నిర్మించవచ్చు. మిగిలిన భూమిని పండ్ల తోటలు, కూరగాయల సాగుకు ఉపయోగించాలి. భవనం ఎత్తు 6 మీటర్లకు మించకూడదు. ఫాంహౌస్‌లు నిర్మించడం చట్టబద్ధం చేయడంతో పాటు అక్రమాలకు అడ్డుకట్ట వేయడం, ఆదాయాన్ని పెంచుకోవడం, ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయడమే ఈ కొత్త పాలసీ లక్ష్యంగా రేవంత్ రెడ్డి సర్కార్ అడుగులు వేస్తోంది.

## స్పోర్ట్స్ స్కూల్‌లో విద్యార్థి ఆత్మహత్యాయత్నం.

**దశ, మేడ్చల్:** శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని హకీంపేట స్పోర్ట్స్ స్కూల్ హాస్టల్‌లో 7వ తరగతి విద్యార్థి శ్రీనాథ్ ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆదివారం హాస్టల్ గదిలో విద్యార్థి ఎస్ శ్రీనాథ్ ఉరివేసుకున్న స్థితిలో కనిపించగా, తోటి విద్యార్థులు వెంటనే సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో సిబ్బంది అక్కడికి చేరుకుని అతన్ని అత్యవసర చికిత్స కోసం కొంపల్లిలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. సూర్యాపేట జిల్లా ఆత్మకూరు మండలానికి చెందిన శ్రీనాథ్ గత సంవత్సరం ఆదిలాబాద్ స్పోర్ట్స్ స్కూల్ నుంచి హకీంపేటకు బదిలీ అయ్యారు . విషయం తెలుసుకున్న రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, స్పోర్ట్స్ అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్ సోనీ బాలాదేవి హుటాహుటినా ఆసుపత్రికి చేరుకుని డాక్టర్లతో , విద్యార్థి తల్లిదండ్రులతో మాట్లాడారు. విద్యార్థి చికిత్సకు ఎంతటి ఖర్చు అయిన ప్రభుత్వమే భరిస్తుందని వెల్లడించారు. పోలీసులు ఘటనపై దర్యాప్తు జరిపి నివేదిక అందించాలని మంత్రి ఆదేశించారు.

## అందానికి అసలైన రహస్యం.. విటమిన్ బి7!

**దశ, హైదరాబాద్:**

మెరిసే, అందమైన, ఒత్తైన జుట్టును సొంతం చేసుకోవాలని ప్రతి ఒక్కరు కోరుకుంటారు. దీని కోసం ఎన్నో రకాల ప్రయత్నాలు కూడా చేస్తూ ఉంటారు. ఖరీదైన నూనెలను, సీరమ్ లను వాడడం, హెయిర్ ప్యాక్ లను వాడడం వంటివి కూడా చేస్తూ ఉంటారు. అయినప్పటికీ చాలా మంది వారు కోరుకున్న జుట్టును పొందలేకపోతున్నారు. జుట్టు అందంగా, ఆరోగ్యవంతంగా ఉండాలంటే హెయిర్ ప్రొడక్ట్స్ ను వాడడంతో పాటు పోషకాహారాన్ని తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. జుట్టు పెరుగుదలకు విటమిన్ బి7 ఎంతో అవసరం. దీనిని బయోటిన్ అని కూడా పిలుస్తారు. జుట్టు, చర్మం, గోళ్ల ఆరోగ్యానికి ఈ విటమిన్ ఎంతో అవసరం. శరీరానికి విటమిన్ బి7 తగినంత అందినప్పుడు మాత్రమే జుట్టు ఆరోగ్యం మెరుగుపడడంతో పాటు జుట్టు సంబంధిత సమస్యలు రాకుండా ఉంటాయి.

### కోడిగుడ్లు, బాదంపప్పు..

జుట్టు ఆరోగ్యంగా ఉండాలనుకునే వారు జుట్టు సమస్యలు ఎక్కువగా ఉన్నవారు బయోటిన్ ఎక్కువగా ఉండే ఆహారాలు తీసుకోవాలి. కనుక బయోటిన్ ఎక్కువగా ఉండే ఆహారాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం. బయోటిన్ ఎక్కువగా ఉండే ఆహారాల్లో గుడ్డు కూడా ఒకటి. ఇది జుట్టు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. గుడ్డును ఉడికించి తీసుకోవడం వల్ల జుట్టు ఆరోగ్యం మెరుగుపడుతుంది. బాదంపప్పులో కూడా బయోటిన్ ఎక్కువగా ఉంటుంది. వీటిని తీసుకోవడం వల్ల ఆరోగ్యకరమైన కొవ్వులు అంది జుట్టు మెరుస్తుంది. చిలగడదుంపలను తీసుకోవడం వల్ల కూడా జుట్టు ఆరోగ్యం మెరుగుపడుతుంది. దీనిలో బయోటిన్ తో పాటు బీటాకెరోటీన్ సమృద్ధిగా ఉంటుంది. వీటిని తినడం వల్ల తలచర్మ ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది.

### పాలకూర, చేపలు..

ఆహారంలో భాగంగా పాలకూరను తీసుకోవడం వల్ల అందమైన జుట్టును సొంతం చేసుకోవచ్చు. పాలకూరను తీసుకోవడం వల్ల బయోటిన్ తో పాటు ఐరన్ కూడా లభిస్తుంది. ఇవి జుట్టు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. సాల్మన్ చేపలను తీసుకోవడం వల్ల జుట్టు అందంతో పాటు ఆరోగ్యం కూడా పెరుగుతుంది. వీటిలో ఉండే ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు తల చర్మాన్ని తేమగా ఉంచడంతో పాటు జుట్టు మెరిసేలా చేస్తాయి. పొద్దు తిరుగుడు గింజలు కూడా జుట్టు ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఎంతో సహాయపడతాయి. వీటిలో బయోటిన్ తో పాటు విటమిన్ ఇ పుష్కలంగా ఉంటుంది. ఇవి రెండు కూడా జుట్టు పెరుగుదలకు సహాయపడతాయి.




### మటన్ లివర్, పుట్ట గొడుగులు..

ఇక అవకాడోలు కూడా పుష్కలంగా బయోటిన్ ను కలిగి ఉంటాయి. వీటిలో ఉండే ఆరోగ్యవంతమైన కొవ్వులు జుట్టు పెరుగుదలకు సహాయపడతాయి. మటన్ లివర్ ను ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల శరీరానికి పుష్కలంగా బయోటిన్ లభిస్తుంది. దీంతో జుట్టు ఆరోగ్యం మెరుగుపడడంతో పాటు జుట్టు పెరుగుదల కూడా వేగంగా ఉంటుంది. అరటిపండ్లల్లో కూడా తగిన మోతాదులో బయోటిన్ ఉంటుంది. వీటిని తీసుకోవడం వల్ల జుట్టు బలంగా తయారవుతుంది. పుట్టగొడుగులు కూడా జుట్టు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వీటిలో బయోటిన్ తోపాటు యాంటీ ఆక్సిడెంట్లు కూడా పుష్కలంగా ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల జుట్టు మూలాలు దెబ్బతినకుండా ఉంటాయి.ఈ విధమైన ఆహారాలను తీసుకోవడం వల్ల జుట్టు రాలడం తగ్గడంతో పాటు అందమైన, ఒత్తైన జుట్టును సొంతం చేసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.

### జుట్టు ఆరోగ్యానికి సలహాలు

**ఒకే ఆహారం ఎక్కువగా కాకుండా, వివిధ రకాల బయోటిన్ సమృద్ధి ఆహారాలు తీసుకోవాలి.**

**తక్కువగా రసాయనాలైన షాంపూలు వాడటం, తల చర్మానికి మృదువైన కూలింగ్ తైలాలు ఉపయోగించడం మంచిది.**

**మద్యపానం, ఎక్కువ చక్కెర, ప్రాసెస్ చేసిన ఆహారం జుట్టు ఆరోగ్యానికి హాని కలిగిస్తుంది.**

**సరైన నీరు తీసుకోవడం, తల మసాజ్ చేయడం, ఒత్తిడి తగ్గించడం జుట్టు ఆరోగ్యానికి అవసరం.**

## రేషన్ సరుకుల పంపిణీలో ఇబ్బందులా? ఫిర్యాదు చేసే మార్గాలు ఇవే!

తెలంగాణ ప్రభుత్వం నిరుపేదలకు కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసిన సంగతి తెలిసిందే. గత కొన్నేళ్లుగా రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డుల సరఫరా నిలిచిపోగా.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజా పాలన దరఖాస్తులు ద్వారా రేషన్ కార్డులు మంజూరు చేసింది. గ్రేటర్ హైదరాబాద్ నగరంలోనూ భారీగా కొత్త కార్డులు జారీ చేశారు. కాగా, నగరంలో నిత్యావసర సరకుల సరఫరా పర్యవేక్షణను పటిష్ఠం చేసేలా సివిల్ సప్లయ్ డిపార్ట్‌మెంట్ ప్రత్యేక దృష్టి సారించింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కొత్త రేషన్ కార్డుల సంఖ్య గణనీయంగా పెరిగిన నేపథ్యంలో సరకుల పంపిణీ పక్కాగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. సరుకులు పక్కదారి పట్టకుండా పర్యవేక్షిస్తున్నారు. కోర్ హైదరాబాద్ ప్రాంతం ప్రస్తుతం చీఫ్ రేషనింగ్ అధికారి పరిధిలో ఉంది. రంగారెడ్డి జిల్లా, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల పరిధిలోని పాత గ్రేటర్ ప్రాంతాలు మాత్రం సంబంధిత జిల్లా సివిల్ సప్లయ్ అధికారుల పరిధిలో ఉన్నాయి. తాజాగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మూడు ప్రత్యేక కార్పొరేషన్లుగా మారింది. కానీ పౌరసరఫరాల వ్యవస్థ మాత్రం గతంలో మాదిరి సీఆర్వో, 3 జిల్లాల పౌరసరఫరాలశాఖ పరిధిలోనే యథావిధిగా కొనసాగనున్నాయి.

నగరంలో కొత్తగా ఇచ్చిన రేషన్ కార్డులతో మూడు కార్పొరేషన్ల పరిధిలో రేషన్ కార్డుల సంఖ్య మొత్తం 15.71 లక్షలకు చేరుకున్నాయి. మొత్తం 57.69 లక్షలమందికి ప్రతినెలా నిత్యావసర సరకులు ఇస్తున్నారు. రేషన్‌షాపులపై నిఘాను పెంచడంతో పాటుగా.. ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకునేందుకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు.

### సేవాలోపంపై ఫిర్యాదులు ఇలా

- 1967 లేదా 180042500333ను కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చు.
- ప్రజావాణి వెబ్‌సైట్‌లో పేరు, మొబైల్ నంబరు, మండలం, జిల్లా వివరాలతో ఫిర్యాదుకు ఛాన్స్ కల్పించారు.
- పౌరసరఫరాలశాఖ ప్రధాన కార్యాలయ ఎర్రమంజిల్‌లోని సివిల్ సప్లైస్ భవన్‌లోనూ రేషన్ లబ్ధిదారులు తమ సమస్యలపై నేరుగా ఫిర్యాదు చేసేందుకు అవకాశం కల్పించారు.
- పౌరసరఫరాలశాఖ పోర్టల్‌లోనూ ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు.
- నేరుగా సీఆర్వో కార్యాలయంలో లేదా జిల్లా పౌర సరఫరాల అధికారికి ఫిర్యాదు చేయవచ్చు.

## సౌతాఫ్రికాపై టీమిండియా ఓటమి!

టీ20 వరల్డ్ కప్ గ్రూప్ స్టేజ్‌లో వరుస విజయాలతో దూసుకొచ్చిన భారత్ సూపర్ 8లో దారుణ పరాభవాన్ని మూటగట్టుకుంది. అహ్మదాబాద్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో సౌతాఫ్రికాపై ఘోర ఓటమిపాలయింది. ఇషాన్ కిషన్, తిలక్ వర్మ, అభిషేక్ శర్మ పెవిలియన్‌కు క్యూ కట్టడంతో టీమిండియా ఓటమి ఖరారయింది. కేవలం 111 పరుగులకే ఆలౌట్ కావడంతో సౌతాఫ్రికా 76 పరుగుల తేడాతో విజయం సాధించింది. కీలకమైన సూపర్ 8 మ్యాచ్‌లో టీమిండియా చేతులెత్తేయడంతో సెమీస్ అవకాశాలు క్లిష్టంగా మారాయి.

ఐసీసీ టీ20 వరల్డ్‌కప్ సూపర్ 8ను భారత్ ఓటమితో ప్రారంభించింది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ క్రికెట్ స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో టీమిండియా బ్యాటర్లు అట్టర్ ఫ్లాప్ అయ్యారు. టాస్ గెలిచిన సౌతాఫ్రికా కెప్టెన్ ఎయిడెన్ మార్క్రమ్ బ్యాటింగ్ ఎంచుకున్నాడు. డేవిడ్ మిల్లర్, డివాల్డ్ బ్రెవిస్, ట్రిస్టన్ స్టబ్స్ బౌండరీల వర్షం కురిపించడంతో 20 ఓవర్లలో 187/7 పరుగులు చేసింది.

భారీ టార్గెట్ ఛేజింగ్‌తో బరిలోకి దిగిన భారత్ తొలి ఓవర్‌లోనే వికెట్ కోల్పోయింది. ప్రతిసారీ అభిషేక్ డకౌట్ అవుతుండగా.. ఈ సారి స్ట్రయికింగ్‌కి వెళ్లిన ఇషాన్ కిషన్ డకౌట్ అయ్యాడు. ఎయిడెన్ మార్క్రమ్ బౌలింగ్‌లో ఇషాన్ వికెట్ కోల్పోయాడు. ఆ తర్వాతి ఓవర్‌లోనే తిలక్ వర్మ (1) కీపర్ క్యాచ్‌గా వెనుదిరిగాడు. ఫామ్‌లోకి వచ్చాడనుకున్న అభిషేక్ (15) కూడా ఐదో ఓవర్‌లోనే పెవిలియన్ బాట పట్టాడు.




పవర్ ప్లేలో టీమిండియా టాప్ ఆర్డర్ మొత్తం కుప్పకూలిపోయింది. 26 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయిన భారత్ ఆ తర్వాత కూడా పెద్దగా రాణించలేకపోయింది. వాషింగ్టన్ సుందర్ 11 బంతుల్లో 11, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ 22 బంతుల్లో 18 పరుగులు చేసి అవుటయ్యారు. దాంతో భారత్ 9.1 ఓవర్లలో 51 పరుగులకు 5 వికెట్లు కోల్పోయింది.

51 పరుగులకే 5 వికెట్లు కోల్పోయిన తర్వాత హార్దిక్ పాండ్యా శివమ్ దూబే మ్యాచ్‌ని కొద్దిసేపు నిలబెట్టారు. ఓటమి ఖరారు అని తెలిసినా రన రేట్‌ను కాపాడుకునే ప్రయత్నం చేశారు. 14వ ఓవర్ తర్వాత భారత్ అటాక్ చేయడం మొదలుపెట్టడం.. మళ్లీ వికెట్లు వరుసగా పడటం మొదలయ్యాయి. హార్దిక్ 17 బంతుల్లో 18 పరుగులు చేసి అవుటవ్వగా.. ఆ తర్వాత బంతికే రింకూ సింగ్ గోల్డెన్ డకౌట్ అయ్యాడు. అదే ఓవర్‌లో అర్ష్‌దీప్ కూడా వికెట్ కోల్పోయాడు. కేశవ్ మహారాజ్ వేసిన 15వ ఓవర్‌లో భారత్ మూడు వికెట్లు కోల్పోయింది.

88 పరుగులకే 8 వికెట్లు కోల్పోవడంతో భారత్ వంద పరుగుల లోపే ఆలౌట్ అవుతుందని అనుకున్నారు. కానీ.. శివమ్ దూబే రాణించడంతో వంద పరుగుల మార్క్‌ను భారత్ దాటేసింది. టీమిండియా బ్యాటర్లలో అందరూ విఫలమయినా శివమ్ దూబే మాత్రం 37 బంతుల్లో 42 పరుగులు చేసి ఆఖరి వరకూ పోరాడాడు. కానీ భారత్ 18.5 ఓవర్లలో 111 పరుగులకు ఆలౌట్ అయింది. దాంతో సౌతాఫ్రికా 76 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది.

## నీటి వాటాలపై రాజీ పడబోం..

**మొదటి పేజీ తరువాయి**

బలంగా విశ్వసిస్తా. గోదావరి, కృష్ణా జలాల్లో తెలంగాణ హక్కులను కాపాడుతూ శాశ్వత పరిష్కారం కోరుకుంటున్నాం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతో చర్చలు ప్రాథమిక దశలో ఉన్నాయి. మాకు ఎలాంటి బేషజాలు లేవు. అధికారుల స్థాయిలో, రెండు రాష్ట్రాల ప్రతినిధులతో చర్చల్లో తేలకపోతే కేంద్ర ప్రభుత్వం వద్ద, లేదా రివర్ మేనేజ్మెంట్ బోర్డుల వద్ద, ట్రిబ్యునళ్ల ముందు లేదా సుప్రీంకోర్టు వరకు ఏదైనా దశల వారిగా వెళ్లాలి. తెలంగాణ నీటి హక్కులను కాపాడే విషయంలో ఎవరికీ ఎలాంటి సందేహాలు అక్కరలేదు. నీటి హక్కుల విషయంలో అనవసరమైన గందరగోళానికి గురిచేయొద్దు. సహేతుకమైన విమర్శలు చేయాలి. నికర జలాలు, మిగులు జలాలు, వరద జలాలపై హక్కులను కాపాడుకుంటాం. గడిచిన పదేళ్లలో చిత్తశుద్ధితో ప్రాజెక్టులను పూర్తి చేసి 967 టీఎంసీల నీటిని వినియోగంలోకి తెచ్చుకుని ఉంటే, వరద జలాలపైనా, వాటా నీటిని తరలించడానికి అవకాశం ఉండే. 2001 లో మొదలైన దేవాదుల రెండు దశాబ్దాలు దాటినా ఇంకా సాగుతూనే ఉంది. ప్రాజెక్టులకు సంబంధించి ఇప్పుడు నిధుల సమస్య వచ్చింది. రూ. 8.11 లక్షల కోట్ల అప్పుల భారం ఉండటం వల్ల అవసరమైన నిధులు విడుదల చేయాలంటే కొరత ఉంది. అందుకే సమీక్షించి వచ్చే రెండేళ్లలో ప్రాజెక్టులన్నీ పూర్తి చేయాలన్న సంకల్పంతో ఉన్నాం. అవసరమైన నిధులను తక్షణమే విడుదల చేయడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇటీవల జరిగిన మేడారం శ్రీ సమ్మక్క - సారలమ్మ మహాజాతర బ్రహ్మాండంగా సాగిందని అన్నారు. దక్షిణ కుంభమేళా తరహాలో జాతర జరిగిందని పేర్కొంటూ, మేడారం అభివృద్ధికి సంబంధించి భక్తులు నిరంతరం సందర్శించేలా అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. శాసనసభ బడ్జెట్ సమావేశాల తర్వాత మరోసారి మేడారం సందర్శించి సమీక్షిస్తానని చెప్పారు.

## మూసీ ప్రాజెక్ట్ పేరుతో రియల్ ఎస్టేట్..

**మొదటి పేజీ తరువాయి**

పంపించారని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ పాలసీ డాక్యుమెంట్ కోసం కేసీఆర్ ఇక్కడి నుంచే ప్రణాళికలు సిద్ధం చేశారని ప్రస్తావించారు. కేసీఆర్ ఈ అపార్ట్‌మెంట్‌ను నిలబెట్టే ప్రయత్నం చేశారని.. రేవంత్ మాత్రం కూల్చేందుకు యత్నిస్తున్నారని దుయ్యబట్టారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచేలా కేసీఆర్ పనిచేశారని చెప్పుకొచ్చారు. మూసీ మురికి పోవాలని బీఆర్ఎస్ ఎప్పుడో పని ప్రారంభించిందన్నారు. రూ. 4000 కోట్లతో ఎస్టీపీలను నిర్మించామని తెలిపారు. గోదావరి జలాలు మూసీకి తీసుకురావాలని బీఆర్ఎస్ నిర్ణయం తీసుకుందన్నారు. రేవంత్‌రెడ్డి ఏది చేసినా.. భూముల పంచాయతీ, రియల్ ఎస్టేట్ చేస్తారని ఆరోపించారు. మూసీ సుందరికీరణ పేరుతో పెద్ద కాంట్రాక్టర్లకు ఇచ్చేలా రేవంత్ ప్రయత్నిస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే విమర్శించారు. మేఘ కృష్ణారెడ్డి, ఆదానీలకు ఇచ్చేలా ప్లాన్ చేశారని ఫైర్ అయ్యారు. హైదరాబాద్‌లో రేవంత్ సర్కార్ కూల్చాడాలు తప్ప ఏ ఒక్క నిర్మాణం చేపట్టలేదని మండిపడ్డారు. రూ.5 కోట్లతో ఇంకో కార్యాలయాన్ని ఓ మంత్రి కడుతున్నారని హరీశ్ రావు ఆరోపించారు. మూసీ సుందరీకరణకు తాము సహకరిస్తామని.. కానీ పేదలను కష్టాల్లోకి నెట్టొద్దని కోరారు. పిల్లలకు పరీక్షలు దగ్గరకు వస్తున్నాయని.. ఈ సమయంలో అపార్ట్‌మెంట్‌ను కూలిస్తే.. తల్లిదండ్రులు ఆందోళన చెందుతారన్నారు. బీఆర్ఎస్ ఈ అపార్ట్‌మెంట్ వారికి అండదండగా ఉంటుందని భరోసా కల్పించారు. అసెంబ్లీలో అపార్ట్‌మెంట్ వాసుల తరపున తాము ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని హరీశ్ రావు పేర్కొన్నారు.